# యోహాను వ్రాసిన మూడవ పత్రిక

అపొస్తులుడైన యోహాను తన ఈ **మూడవ** పత్రికలో ఆత్మ వర్థిల్లుటను గూర్చి గాయియును మెచ్చుకొనుచు దుష్టుడైన దియొత్రెఫేను గూర్చి ఫిర్యాదు చేయుచు, దేమేత్రిని గూర్చి మంచి సాక్ష్యమును యిచ్చుచున్నాడు.

**యోహాను వ్రాసిన మూడవ పత్రిక-అనుక్రమణిక**

| అధ్యా. వచ | పాఠ్య సారాంశము |
|---|---|
| 1:1-6 | ఆత్మ వర్థిల్లుటను గూర్చి గాయియును మెచ్చుకొనుట |
| 1:7-8 | నిజమైన బోధకుడు |
| 1:9-10 | దుష్టుడైన దియొత్రెఫేను గూర్చి ఫిర్యాదు |
| 1:11-12 | దేమేత్రిని గూర్చి మంచి సాక్ష్యము |
| 1:13-14 | ముగింపు |

## యోహాను వ్రాసిన మూడవ పత్రిక 1వ అధ్యాయము

### ఆత్మ వర్థిల్లుటను గూర్చి గాయియును మెచ్చుకొనుట

పెద్దనైన నేను, సత్యమును బట్టి ప్రేమించు ప్రియుడైన గాయియునకు శుభమని చెప్పి వ్రాయునది.
2 ప్రియుడా, నీ ఆత్మ వర్థిల్లుచున్న ప్రకారము నీవు అన్ని విషయములలోను వర్థిల్లుచు సౌఖ్యముగా
ఉండవలెనని ప్రార్థించుచున్నాను. 3 నీవు సత్యమును అనుసరించి నడుచుకొనుచున్నావు గనుక సహోదరులు
వచ్చి, నీ సత్యప్రవర్తనను గూర్చి సాక్ష్యము చెప్పగా విని బహుగా సంతోషించితిని. 4 నా పిల్లలు సత్యమును
అనుసరించి నడుచుకొనుచున్నారని వినుట కంటే నాకు ఎక్కువైన సంతోషము లేదు. 5 ప్రియుడా, వారు
పరదేశులైనను సహోదరులుగా ఉన్నవారికి నీవు చేసినదెల్ల విశ్వాసికి తగినట్టుగా చేయుచున్నావు. 6 వారు నీ
ప్రేమను గూర్చి సంఘము ఎదుట సాక్ష్యమిచ్చిరి.

### నిజమైన బోధకులు

7 వారు అన్యజనుల వలన ఏమియు తీసి కొనక ఆయన నామము నిమిత్తము బయలు దేరిరి గనుక
దేవునికి తగినట్టుగా నీవు వారిని సాగనంపిన యెడల నీకు యుక్తముగా ఉండును. 8 మనము సత్యమునకు
సహాయకుల మవునట్టు అట్టివారికి ఉపకారము చేయబద్ధులమై యున్నాము.

### దుష్టుడైన దియొత్రెఫేను గూర్చి ఫిర్యాదు

9 నేను సంఘమునకు ఒక సంగతి వ్రాసితిని. అయితే వారిలో ప్రధానత్వము కోరుచున్న దియొత్రెఫే
మమ్మును అంగీకరించుట లేదు. 10 వాడు మమ్మును గూర్చి చెడ్డ మాటలు వదరుచు, అది చాలనట్టుగా,
సహోదరులను తానే చేర్చుకొనక, వారిని చేర్చుకొన మనస్సు గలవారిని కూడ ఆటంక పరచుచు సంఘములో
నుండువారిని వెలివేయుచున్నాడు అందుచేత నేను వచ్చినప్పుడు వాడు చేయుచున్న క్రియలను జ్ఞాపకము
చేసికొందును.

**దేమేత్రిని గూర్చి మంచి సాక్ష్యము**

11 ప్రియుడా, చెడు కార్యమును కాక మంచి కార్యము ననుసరించి నడుచుకొనుము. మేలుచేయువాడు దేవుని సంబంధి; కీడుచేయువాడు దేవుని చూచిన వాడు కాదు. 12 దేమేత్రియు అందరి వలనను సత్యము వలనను మంచి సాక్ష్యము పొందినవాడు. మేము కూడా అతనికి సాక్ష్యమిచ్చుచున్నాము మా సాక్ష్యము సత్యమైనదని నీ వెరుగుదువు.

**ముగింపు**

13 అనేక సంగతులు నీకు వ్రాయవలసియున్నది గాని సిరాతోను కలముతోను నీకు వ్రాయ నాకిష్టము లేదు. 14 శీఘ్రముగా నిన్ను చూడ నిరీక్షించుచున్నాను అప్పుడు ముఖాముఖిగా మాటలాడు కొనెదము. నీకు సమాధానము కలుగును గాక. మన స్నేహితులు నీకు వందనములు చెప్పుచున్నారు. నీ యొద్దనున్న స్నేహితులకు పేరు పేరు వరుసను వందనములు చెప్పుము.